# మానవాళి చీకట్లను తరిమిన మండే అగ్ని కణం మండేలా !

## (18 జూలై 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' సందర్భంగా)

నెల్సన్ మండేలా జీవితం నిత్య పోరాటాల మయం, మనందరికీ ఆదర్శప్రాయం. వర్ణ, జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాడుతూ, తన జీవితాన్ని సమాజోన్నతికి దారపోసిన మండే అగ్ని కణం నెల్సన్ మండేలా. నెల్సన్ మండేలా జీవితాన్ని నేటి ప్రపంచ యువతకు పరిచయం చేయడానికి, తాను నమ్మిన విలువల నుంచి ప్రేరణ పొందడానికి ప్రతి ఏట నెల్సన్ మండేలా జన్మదినమైన 18 జూలై రోజున 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' పాటిస్తున్నాం. ఐరాస జనవరల్ అసెంబ్లీ తీర్మానంతో 18 జూలై 2010 నుంచి ఈ దినోత్సవం పాటించుట ప్రారంభమైంది. మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారాలు వెతకడానికి, సకారాత్మక మార్పుకు బీజం వేయాలని, సమసమాజ స్థాపనకు కృషి చేయాలనే ఉద్దేశంతో ఈ వేదికలను నిర్వహిస్తున్నాం. 'అంతర్జాతీయ నెల్సన్ మండేలా దినం' వేదికగా ప్రజాహిత జీవన విలువలు, నిస్వార్థ స్వచ్ఛంధ సేవ, సంక్షోభ నివారణ, జాతి-వర్ణ వివక్ష, మానవ హక్కుల పరిరక్షణ, పేదరిక నిర్మూలన, లింగ సమానత్వం, బాలల హక్కులు, ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక న్యాయం, దాతృత్వం, సాంస్కృతిక పునరుజ్జీవనం, హెచ్ఐవి-ఏయిడ్స్ అవగాహన, ప్రపంచ శాంతి లాంటి అంశాల పట్ల అవగాహన కల్పించుట జరుగుతుంది.

### వ్యక్తిగత జీవితం:

18 జూలై 1918న దక్షిణ ఆఫ్రికా రాయల్ తెంపూ కుటుంబంలో జన్మించిన మండేలా సౌత్ ఆఫ్రికా విశ్వవిద్యాలయంలో బిఏ పట్టాను, ఫోర్ట్ హేరి విశ్వవిద్యాలయంలో యల్‌యల్‌బి (న్యాయశాస్త్రం) పట్టా పొంది, జొహెనెస్బర్గ్‌లో న్యాయవాదిగా పని చేశారు. జాతి వివక్ష వ్యతిరేక పోరాటానికి ఆకర్షితుడై, 1943లో ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్‌లో చేరి యువజన విభాగాన్ని నెలకొల్పారు. 1944లో ఎవెలిన్ మాస్‌ను వివాహమాడిన మండేలా 1958లో విడాకులు తీసుకున్నారు. 1958లో విన్నీ మడికిజెలాను వివాహమాడి 1996లో విడాకులు తీసుకున్నారు. 1998లో గ్రేక మాచెల్‌ను 3వ భార్యగా వివాహమాడిన మండేలాకు మె?త్తంగా ఏడుగురు సంతానం కలిగారు.

### ప్రజా జీవితం:

జాగతి వివక్ష పోరులో పలు మార్లు జైలు పాలైన మండేలా, 1962లో జీవిత ఖైదీగా శిక్ష విధించారు. 1964 - 82 వరకు రాబెన్ దీవిలో, 1988 వరకు పోల్స్‌మూర్ కారాగారంలో ఖైదీగా జైలు జీవితం అనుభవించారు. దాదాపు 27 ఏండ్లు కారాగార జీవితం అనుభవించిన మండేలా నాటి అధ్యక్షుడు డీ క్లార్క్ ఆదేశంతో 1990లో జైలు నుంచి విడుదల అయ్యారు. దక్షిణ ఆఫ్రికా తొలి అధ్యక్షుడిగా (1994 - 99) సేవలు అందించిన మండేలా ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రేస్ అధ్యక్షుడిగా (1991 - 97), అలీన ఉద్యమ సెక్రటరీ జనరల్‌గా (1998 - 99) విశిష్ట సేవలు అందించి అంతర్జాతీయ గుర్తింపు పొందారు. నెల్సన్ మండేలా అసమాన్య సేవలకు గుర్తుగా నోబెల్ శాంతి బహుమతి (1993), భారతరత్న (1990), నిషాన్-ఇ-పాకిస్థాన్ (1992), లెనిన్ శాంతి బహుమతి (1990), సఖరోవ్ బహుమతి (1988) లాంటి పలు అంతర్జాతీయ పురస్కారాలు అందుకున్నారు. 05 డిసెంబరు 2013న తన 93వ ఏట జొహనెస్‌బర్గ్‌లో తుదిశ్వాస విడిచారు.

### ప్రపంచ మానవాళికే ఆదర్శం:

నెల్సన్ మండేలా జీవిత చరిత్రను 'లాంగ్ వాక్ టు ఫ్రీడమ్' పుస్తకరూపంలో వెలువరించారు. బాల్యంలో 'రోహిలాలా మండేలా' పేరుతో పిలువబడ్డ నెల్సన్ మండేలా 50కి పైగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డిగ్రీలు పొందారు.

శాంతి మంత్రాన్ని శ్వాసిస్తూ, క్షమాగుణాన్ని ప్రదర్శించిన మండేలా సానుకూల దృక్పథంతో ముందు చూపు కలిగిన మేధావిగా రుజువు చేసుకున్నారు. మానవ సేవలో తన జీవితాన్నే అర్పించిన నెల్సన్ మండేలా మానవ హక్కుల లాయర్‌గా, చరసాలనే సమాజ మార్పుకు వాడుకున్న విలక్షణ వ్యక్తిగా, అంతర్జాతీయ శాంతి స్థాపన యోధుడిగా, దక్షిణాఫ్రికా ప్రజాస్వామ్య ప్రభుత్వంలో ఎన్నికైన తొలి అధ్యక్షుడిగా ప్రపంచ మానవాళికే శాంతి సంక్షేమ దారి దీపస్తంభంగా నిలిచారు. విధ్వంసం చేయడం అత్యంత సులభమేగాని, హీరోలా నిలబడి చరిత్ర నెలకొల్పడం చాలా కష్టమని నమ్మిన నెల్సన్ మండేలా దాదాపు ఏడు దశాబ్దాలు ప్రజా సేవలో జీవితాన్ని త్యాగం చేశారు. ఒక వ్యక్తి మహాశక్తిగా రూపాంతరం చెంది దక్షిణ ఆఫ్రికాతో పాటు ప్రపంచ మానవాళిని అత్యంత ప్రభావితం చేసిన నెల్సన్ మండేలా జీవితం అన్ని తరాల ప్రజలకు ప్రేరణాత్మకం, ప్రశంసనీయం, అనుసరణీయం.

- డా|| బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# 'ప్రపంచ విమానయాన కేంద్రం' హోదా సాధించే దిశగా దేశీయ ఎమ్ఆర్ఓ పరిశ్రమకు ఊతమిచ్చే విధంగా 5% ఏకరీతి సమీకృత వస్తుసేవల పన్ను అమలు

న్యూఢిల్లీ, జులై 16 :విమానాలు, ఇంజన్ విడిభాగాలపై 2024 జులై 15 నుండి 5% ఏకరీతి సమీకృత వస్తుసేవల పన్ను (ఐజీఎస్టీ) అమలు చేస్తున్నట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. భారత్ 'ప్రపంచ విమానయాన కేంద్రం' హోదా సాధించే ఆశయంలో భాగంగా చేపట్టిన ఈ చర్య, దేశీయ నిర్వహణ, మరమ్మత్తుల పరిశ్రమ (ఎమ్ఆర్ఓ)లో మైలురాయిగా నిలవనుంది.

"ఎమ్ఆర్ఓ విడిభాగాలపై 5% ఐజీఎస్టీ అమలు చర్య విమానయాన రంగానికి ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది. ఇప్పటి వరుకు వివిధ విడిభాగాలకి వేర్వేరు రేట్లు - 5%, 12%, 18%, 28% వసూలయ్యేది; ఆ విధానం విలోమ సుంకం, ఎమ్ఆర్ఓ అకౌంట్లలో నిధులు పేరుకుపోవడం వంటి పలు సమస్యలకి దారి తీసేది. నూతన విధానం ఈ అసమానతలు తొలగించి పన్నుల విధానాన్ని సరళతరం చేసి ఎమ్ఆర్ఓ పరిశ్రమ అభివృద్ధికి దోహదపడుతుంది" అని శ్రీ నాయుడు వివరించారు.

సరికొత్త మార్పులు చేపట్టడంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వ దార్శనికతను ఉటంకిస్తూ, " ప్రధాని మోదీ మార్గనిర్దేశనంలో 'ఆత్మ నిర్భర్ భారత్' ఆశయ సాధనకు మేము కట్టుబడి ఉన్నాం. భారత్ ను విమానయాన రంగంలో ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా సరికొత్త విధానానికి ప్రధానమంత్రి అందించిన మద్దతు ఎంతో కీలకమైనది" అని కేంద్రమంత్రి పేర్కొన్నారు.

విధాన సవరింపు సాధనలో పరిశ్రమించిన పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ, కేంద్ర ఆర్థిక శాఖ సహా సంబంధీకులందరికీ కేంద్రమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. జూన్ 22, 2024న జరిగిన జీఎస్టీ మండలి 53వ సమావేశంలో విధాన సవరింపుకు సంబంధించి సూచనలు జరిగాయి. నిర్వహణ ఖర్చుల నియంత్రణ, పన్నులు, ఋణాలకు సంబంధించిన చిక్కుల తొలగింపు, పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యాలుగా 5% ఏకరీతి సమీకృత వస్తుసేవల పన్ను అమలు ప్రారంభమైంది.

# మూడు బొగ్గు గనుల కోసం ఒప్పందాలపై బొగ్గు మంత్రిత్వ శాఖ సంతకాలు

న్యూఢిల్లీ, జులై 16 : బొగ్గు మంత్రిత్వ శాఖ ఇవాళ ఏడో విడతలో రెండో ప్రయత్నం లో భాగంగా వేలం వేసిన మూడు బొగ్గు గనుల నుంచి బొగ్గు తవ్వకం, అభివృద్ధి, ఉత్పత్తి సంబంధిత ఒప్పందాలను కుదుర్చుకోవడం లో విజయవంతమైంది. ఈ ఘట్టం వాణిజ్య సరళిలో బొగ్గు గనుల తవ్వకం లో ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకోవడాన్ని సూచిస్తున్నది. మూడు గనులలోను రెండింటిని పాక్షికంగా అన్వేషించడం జరగగా, ఒక గనిని పూర్తి స్థాయిలో అన్వేషించడమైంది. ఒప్పందాలు కుదిరిన గనులలో మచ్చకట బొగ్గుగని (సవరించింది), కుడనాలీ లూబ్రి బొగ్గు గని, సఖీగోపాల్-బి కాకుర్‌హీ బొగ్గు గని ఉన్నాయి. వేలంలో సఫలం అయిన సంస్థలలో వరుసగా ఎన్ఎల్‌సి ఇండియా లిమిటెడ్, గుజరాత్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పరేషన్ లిమిటెడ్, ఇంకా తమిళ నాడు జనరేషన్ అండ్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఉన్నాయి. ఈ మూడు గనుల నుంచి వాణిజ్య పరమైన వేలంపాట ప్రక్రియలో భాగంగా ఏటా ఆదాయం సుమారు 2,991.20 కోట్ల రూపాయల మేరకు ఉండవచ్చు. ఇది దాదాపుగా 30.00 ఎమ్ టిపిఏ మొత్తం పీక్ రేట్ సావ ర్థ్యం మేరకు ఉత్పత్తి జరగడం పైన ఆధారపడి ఉంటుంది. ఈ గనులలో కార్యకలాపాలు మొదలైతే సుమారుగా 40,560 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావ కాశాలు అందివస్తాయి. దీనికి అద నంగా, ఈ బొగ్గు గనులలో కార్యకలాపాలను ప్రారంభించడం కోసం ఇంచుమించు 4,500 కోట్ల రూపా యల మొత్తం పెట్టుబడిని కేటాయించనున్నారు. ఈ కార్యక్రమం బొగ్గు రంగంలో స్వయం సమృద్ధికి, ఆర్థిక వృద్ధికి, ఉద్యోగాల కల్పనకు తోడ్పడు తూ, దేశ ఇంధన భద్రతకు పూచీపడే దిశలో ఒక ముఖ్య మైన ముందంజ గా ఉంటుందని చెప్పాలి.

# హెల్త్ కార్డులు.. న్యాయవాదులకు ఆర్థిక ధీమాను కలిగిస్తాయి..




నిజామాబాద్, జులై 16 :ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఆరోగ్య కార్డులు చాలా ఉపయోగ పడతాయని హెల్త్ కార్డులతో న్యాయవాదులకు ఆర్థిక ధీమాను కలిగిస్తాయని బార్ అధ్యక్షుడు జగన్ అన్నారు. ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తినప్పుడు ఆరోగ్య కార్డులు చాలా ఉపయోగపడతాయన్నారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ న్యాయవాదులకు హెల్త్ కార్డులను బార్ అధ్యక్షుడు జగన్ మోహన్ గౌడ్, అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ సభ్యురాలు పరిపూర్ణ రెడ్డితో కలిసి అందజేశారు.

మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోని బార్ సమావేశపు హాల్ లో నిర్వహించిన కార్యక్రమంలో బార్ ఉపాధ్యక్షుడు రాజు ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, కార్యదర్శి దొన్పల్ సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బార్ అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ ప్రతి న్యాయవాదికి ఆరోగ్యపరంగా ఎలాంటి ఆర్థిక ఇబ్బందులకు గురికావద్దనే లక్ష్యంతో తెలంగాణ రాష్ట్ర అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ కార్డులను అందజేయడం జరుగుతున్నదని తెలిపారు. ప్రతి సంవత్సరం కార్డులను రెన్యూవల్ చేసి ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అడ్వొకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ రాష్ట్ర సభ్యురాలు పరిపూర్ణ మాట్లాడుతూ? ట్రస్ట్ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న న్యాయవాదులకు హెల్త్ కార్డులను పంపిణీ చేయడం జరుగుతున్నదని తెలిపారు. ఒకవేళ అనారోగ్యానికి గురైన వారికి రెలక్షల రూపాయల వరకు ఉచిత భీమా సౌకర్యం కల్పించడం హెల్త్ కార్డుల పంపిణీలో ఉన్న ముఖ్యమైన ప్రయోజనమని ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్ ఎ దీపక్ అయ్యూబ్, చెలిమెల రాజేశ్వర్, కుమార్ దాస్, సాయిరెడ్డి, మధుసుదన్ రావు, కుంట శ్రీనివాస్ రెడ్డి, ఎన్.ఎల్ శాస్త్రి, కవిత గంగోనే, ఇందుమతి, రజిత, అంజలి పాల్గొన్నారు.

సాహితీ కిరణం ఆహ్వానము ప్రపంచరికార్డులు సాధించిన శ్రీ త్యాగరాయ గానసభ
సాహితీ కిరణం 15వ వార్షికోత్సవ వేడుకలు
ముఖ్య అతిథి : డా|| కె.వి.రమణ ఐ.ఎ.ఎస్ (ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు
సభాధ్యక్షులు : శ్రీ గుదిబండి వెంకటరెడ్డి
గౌరవ సంపాదకులు, సాహితీకిరణం
విశిష్ట అతిథి : శ్రీ కళా వి.ఎస్.జనార్ధనమూర్తి
అధ్యక్షులు శ్రీ త్యాగరాయ గానసభ
గౌరవ అతిథి : శ్రీ బైస దేవదాసు
సంపాదకులు, నేటినిజం
సభాప్రారంభకులు : శ్రీ పొత్తూరి సుబ్బారావు
సంపాదకులు సాహితీకిరణం
కార్యక్రమ నిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటదాసు
సలహాదారులు సాహితీకిరణం
శ్రీమతి పింగళి కమలాకేసరి నెలకొల్పిన డా||పింగళి జగన్నాథరావు స్మారక సాహిత్య పురస్కారం-2024 శ్రీ మరుమాముల దత్తాత్రేయ శర్మకి ప్రదానం
శ్రీ సిరిగాద శంకర్ నెలకొల్పిన శ్రీ సిరిగాద నర్సయ్య స్మారక సాహిత్య పురస్కారం-2024 శ్రీ రమణ వెలమకన్నికి ప్రదానం
శ్రీమతి సిరిగాద బాలమ్మ స్మారక సాహిత్యపురస్కారం-2024 శ్రీమతి శైలజామిత్రకి ప్రదానం
శ్రీ గట్టుపల్లి సీతారామారావు నెలకొల్పిన శ్రీ గట్టుపల్లి చెంచురామారావు స్మారక ఆధ్యాత్మిక సాహిత్య పురస్కారం-2024 శ్రీ బండారుపల్లి రామచంద్రరావుకి ప్రదానం
శ్రీ యం.బాలగంగాధరయ్య నిర్వహించిన బాలనాగయ్య స్మారక కవితాసంపుటాల పోటీ విజేతలు
శ్రీ యాములపల్లి నరసిరెడ్డి-అనంతపురం
శ్రీ లేదాళ్ళ రాజేశ్వరరావు-లక్సెట్టిపేట
డా||ఉదారి నారాయణ-ఆదిలాబాద్
సాహితీ కిరణం ఆత్మీయ పురస్కారాలు
డా||యమ్.మధుసూదన్
శ్రీ యం.వి.కృష్ణారావు
శ్రీ రమణ బొమ్మకంటి
శ్రీ మల్లాది వెంకట రమణ
శ్రీ పి.రామోజు శ్రీనివాస్
శ్రీ పదిరంస నరసింహారెడ్డి
సాంస్కృతిక కార్యక్రమం
శ్రీభాస్కర కళాసామ్రాజ్యం- హైదరాబాద్ వారు సమర్పించు పౌరాణిక పద్యనాటకము పాండవోద్యోగము లోని (రచన:తిరుపతి వెంకటకవులు) ముఖ్యమైన ఘట్టము 'శయనదృశ్యము'
పాత్రలు-పాత్రధారులు
శ్రీకృష్ణుడు: శ్రీ కుందుర్తి వెంకటకృష్ణ ,FIE
అర్జునుడు: శ్రీ కొతవరపు గణేష్‌కుమార్
దుర్యోధనుడు: శ్రీ ఉప్పలూరి రఘురామశర్మ
హార్మోనియం: శ్రీ నామాచంద్రబాబునాయుడు
మేకప్: శ్రీ బి.పరమేశ్వర్
తేది: 19.07.2024 శుక్రవారం సా||6.00గం||లకు - వేదిక: శ్రీ త్యాగరాయ గానసభ గుండవరపు హనుమంతరావు కళావేదిక, చిక్కడపల్లి, హైదరాబాద్
శ్రీ త్యాగరాయ గానసభ శ్రీమతి కళాశారదా దీక్షితులు ప్రధాన కార్యదర్శి
సాహితీకిరణం శ్రీమతి పి.జయలక్ష్మి - మేనేజర్ లయన్ వి.వి.రాఘవరెడ్డి - సలహాదారులు

# టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డే ఆక్రమించాడు

## - మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి

అమరావతి జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: గత ఐదేళ్లలో వైసిపి నేతలు భారీ భూదోపిడీకి పాల్పడ్డారని మంత్రి రామ్ ప్రసాద్ రెడ్డి మండిపడ్డారు. గత ప్రభుత్వంలో భూదోపిడీలో వైసిపి మంత్రులు, ఎంఎల్ఎలు కీలక పాత్ర పోషించారని, వైసిపి మాజీ ఎంఎల్ఎలు పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి చిత్తూరు జిల్లాల్లోనే మూడ వేల ఎకరాలు దోచుకున్నారని ఆరోపణలు చేశారు. టిటిడి మఠాల భూములను పెద్దిరెడ్డి కుటుంబం వదల్లేదని, చట్టపరంగా విచారణ జరిపి త్వరలోనే వారిపై చర్యలు తీసుకుంటామన స్పష్టం చేశారు. ఇప్పటికే రెవెన్యూ, దేవాదాయ అధికారులు విచారణ ముమ్మరం చేశారని, ఎపిలో ఉన్న గ్రానైట్ కొండలన్నీ పెద్దిరెడ్డే హస్తగతం చేసుకున్నారని, తమ భూములు కబ్జాకు గురయ్యాయని ఫిర్యాదు చేసే కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు. భూములు, ఇసుక, మైనింగ్ దోపిడీకి పాల్పడిన వారిని వదిలిపెట్టమని హెచ్చరించారు. మైనింగ్ శాఖలో అవినీతిపై ఇప్పటికే విచారణ జరుగుతోందన్నారు. ఆర్‌టిసి నుంచి ఎలక్ట్రిక బస్సులు నడిపేందుకు సంస్థలతో చర్చిస్తున్నామని, గత ఐదేళ్లలో ఆర్‌టిసిని జగన్ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని రామ్ ప్రసాద్ రెడ్డి ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రాగానే 200 వరకు కొత్త బస్సులు రోడ్డెక్కాయని, మరో 1200 కొత్త బస్సులు రోడ్డెక్కనున్నాయని వివరించారు.

# ఎపిఎస్‌ఆర్టీసీకి కొత్త కళ .. త్వరలో రోడ్డెక్కనున్న ఎలక్ట్రిక్ బస్సులు

అమరావతి, జులై 16 : ఆర్టీసీ నుంచి ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు వివిధ సంస్థలతో చర్చలు జరుపుతున్నామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు అనుకూలంగా వాహనాలను ప్రోత్సహించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబుఆలోచన అని అన్నారు. ఆర్టీసీ నుంచి త్వరలోనే ఎలక్ట్రిక్ బస్సులు రోడ్డెక్కనున్నాయని తెలిపారు. గత ఐదేళ్లలో ఆర్టీసీని వైసీపీ పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శలు గుప్పించారు.

కొత్త బస్సులు కొనుగోలు చేయకుండా ప్రజల ప్రాణాలతో జగన్ చెలగాటమాడాడని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లోనే 200 వరకూ కొత్త బస్సులు రోడ్డెక్కాయన్నారు. వచ్చే మూడు నెలల్లో మరో 1200 కొత్త బస్సులు రోడెక్కేలా ఆర్డర్లు పెట్టామన్నారు. ఆర్టీసీ బస్సులకు చంద్రబాబు పెట్టిన అమరావతి బ్రాండ్ దెబ్బతీసేలా జగన్ డాల్ఫిన్ క్రూజ్ పేరుతో బస్సుల్ని ప్రోత్సహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సులకు చంద్రబాబు పెట్టిన అమరావతి బ్రాండ్ పీకటం జగన్ తరం కాదన్నారు. వ్యక్తిగత కక్షతో జగన్ నిర్వీర్యం చేసిన అమరావతి బ్రాండ్ బస్సులను తిరిగి పునరుద్దరిస్తామని మంత్రి రాం ప్రసాద్ రెడ్డి స్పష్టం చేశారు.

# శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా ఆణివార ఆస్థానం

## -వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు : టీటీడీ ఈవో జె.శ్యామలరావు
## -శ్రీరంగం నుండి శ్రీవారికి పట్టువస్త్రాల సమర్పణ



తిరుపతి, జులై 16 :తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం సాలకట్ల ఆణివార ఆస్థానం శాస్త్రోక్తంగా జరిగింది. తిరుమల పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈవో జె.శ్యామలరావు పాల్గొన్నారు. ముందుగా ఉదయం 7 నుండి 9 గంటల వరకు బంగారువాకిలి ముందు గల ఘంటా మండపంలో సర్వభూపాల వాహనంలో ఉభయదేవేరులతో కూడిన మలయప్పస్వామివారు గరుత్మంతునికి అభిముఖంగా కొలువుకు వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడైన విష్వక్సేనులవారు దక్షిణాభిముఖంగా వేంచేపు చేశారు. అనంతరం ఆనందనిలయంలోని మూలవిరాట్టుకు, బంగారు వాకిలి వద్ద ఆస్థానంలో వేంచేపు చేసిన ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు, ప్రసాదాలు నివేదించారు.

అనంతరం పెద్దజీయర్‌స్వామి పెద్ద వెండితట్టలో ఆరు పెద్ద పట్టువస్త్రాలను తలపై పెట్టుకొని మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా విచ్చేశారు. చిన్నజీయర్‌స్వామి, ఈవో, ఇతర ఉన్నతాధికారులు వెంట వచ్చారు. నాలుగు పట్టు వస్త్రాలను మూలవిరాట్టుకు అలంకరించారు. మిగిలిన రెండు వస్త్రాలలో ఒకటి మలయప్పస్వామి వారికి, మరొకటి విష్వక్సేనులవారికి అలంకరించారు.

అనంతరం శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు తమ తలకు శ్రీవారి పాదవస్త్రంతో "పరివట్టం"(చిన్న పట్టుగుడ్డ) కట్టుకొని స్వామివారి ద్వారా బియ్యపు దక్షిణ స్వీకరించి 'నిత్యైశ్వర్యోభవ' అని స్వామివారిని ఆశీర్వదించారు. ఆ తరువాత అర్చకులు పెద్దజీయ్యర్ కు, చిన్న జీయ్యర్ కు, టీటీడీ తరఫున ఈవోకి 'లచ్చన' అను తాళపు చెవి గుత్తిని వరుస క్రమంలో కుడిచేతికి తగిలించారు.

"రూపాయి" హారతి, చందనం, తాంబూలం, తీర్థం, శఠారి మర్యాదలు చేసిన అనంతరం ఆ తాళపు చెవి గుత్తిని శ్రీవారి పాదాల చెంత ఉంచడంతో ఆణివార ఆస్థానం ముగిసింది.

### వార్షిక లెక్కలు ప్రారంభించిన రోజు : టీటీడీ ఈవో

ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ... సాధారణంగా ప్రతి సంవత్సరం సౌరమానం ప్రకారం దక్షిణాయన పుణ్యకాలంలో కర్కాటక సంక్రాంతి రోజున ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారని చెప్పారు. అయితే సౌరమానాన్ని అనుసరించే తమిళుల కాలమానం ప్రకారం ఆణిమాసం చివరి రోజున నిర్వహించే కొలువు కావడంతో ఆణివార ఆస్థానం అని పేరు వచ్చిందన్నారు. పూర్వం మహంతులు దేవస్థాన పరిపాలనను స్వీకరించిన రోజు అయిన ఈ ఆణివార ఆస్థానం పర్వదినం నాటి నుండి టీటీడీ వారి ఆదాయ వ్యయాలు, నిల్వలు తదితర వార్షిక లెక్కలు ప్రారంభమయ్యేవని తెలిపారు. టీటీడీ ధర్మకర్తల మండలి ఏర్పడిన తరువాత వార్షిక బడ్జెట్‌ను మార్చి ? ఏప్రిల్ నెలలకు మార్చినట్టు వివరించారు. సాయంత్రం పుష్పపల్లకీపై స్వామి, అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేఈఓలు గౌతమి, వీరబ్రహ్మం, సివి అండ్ ఎస్ఓ నరసింహ కిషోర్, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల్ దీక్షితులు, గోవిందరాజ దీక్షితులు, ముఖ్య అర్చకులు కిరణ్ స్వామి, ఎస్ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, అదనపు ఆరోగ్యశాఖ అధికారి సునీల్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

### శ్రీరంగం నుండి తిరుమల శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పణ..

ఆణివార ఆస్థానం పర్వదినం సందర్భంగా తమిళనాడులోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరంగం రంగనాథస్వామి తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. మంగళవారం ఉదయం బేడి ఆంజనేయస్వామివారి ఆలయం పక్కన గల తిరుమల పెద్ద జీయర్‌స్వామి మఠంలో శ్రీవారి సారెకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడినుండి తమిళనాడు దేవాదాయ శాఖ మంత్రి శేఖర్ బాబు, తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్‌స్వామి, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కలిసి పట్టువస్త్రాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా నాలుగు మాడ వీధుల ప్రదక్షిణగా ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు దేవాదాయ శాఖ ప్రత్యేక కార్యదర్శి కుమార గురుబాలన్, శ్రీరంగం ఆలయ ఆలయ జాయింట్ కమిషనర్ మారియప్పన్, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో మంత్రి సవితమ్మ భేటీ..



అమరావతి, జులై 16 :విజయవాడలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ తో రాష్ట్ర బీసీ సంక్షేమం, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ భేటీ అయ్యారు.

కేశవ్‌కు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించిన పలు అంశాలపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో మంత్రి సవితమ్మ మాట్లాడారు

# పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉంది

## -ఎమ్మెల్యేలకు డీఎస్పీలు బెదిరింపులు
## -బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు పాల్పడుతున్న సంగతి తెలిసిందే. ఈ పార్టీ ఫిరాయింపులకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంపై అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద జర్నలిస్టులు అడిగిన ప్రశ్నకు కేటీఆర్ బదులిచ్చారు.రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో దుర్మార్గమైన పరిస్థితులు నెలకొన్నాయి. ఒక ఇద్దరు ఎమ్మెల్యేలకు వారి నియోజకవర్గాల్లో ఉన్న డీఎస్పీలు ఫోన్ చేసి పార్టీ మారండి.. లేదంటే ప్రాణగండం ఉందని బెదిరించారు. ఇంకా కొందరిని బెదిరింపులకు గురి చేస్తున్నారు. బీజేపీని వాషింగ్ మిషన్ పార్టీగా విమర్శించిన కాంగ్రెస్ అదే పనిని తెలంగాణలో చేస్తోంది. వేరే రాష్ట్రాల్లో బీజేపీ కాంగ్రెస్ ఎమ్మెల్యేలను తీసుకుంటే మర్డర్ ఆఫ్ డెమోక్రసీ అంటున్నారు. కానీ మీరు చేస్తున్నది ఏంటని అడిగితే సమాధానం లేదు. కానీ సేమ్ అదే పని తెలంగాణలో చేస్తున్నారు. ఎమ్మెల్యేలు పార్టీ మారకపోతే వారి సొంత ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. విజిలెన్స్ దాడులతో బెదిరిస్తున్నారు. భయభ్రాంతులకు గురి చేస్తున్నారు అని కేటీఆర్ తెలిపారు.బడే భాయ్ చోటే భాయ్‌కి తేడా ఏం లేదు. ఢిల్లీలో బడే భాయ్ నరేంద్ర మోడీ రాజ్యాంగబద్ధ సంస్థలను ఉపయోగించుకున్నట్లుగానే ఇక్కడ చోటే భాయ్ రేవంత్ రెడ్డి ప్రభుత్వ విభాగాలను ఉపయోగించుకుని మా ఎమ్మెల్యేలను బెదిరింపులకు గురి చేస్తున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల మీద మాకు సానుభూతి ఉంది. ఎందుకంటే వారికి వారే ఆత్మహత్య చేసుకున్నారు. వారిని ఎవరూ కాపాడలేరు. ప్రజలు తప్పకుండా శిక్షిస్తారు. రాజకీయాల్లో హత్యలు ఉండవు.. ఆత్మహత్యలే ఉంటాయనడానికి ఇదే ఉదాహరణ అని కేటీఆర్ పేర్కొన్నారు.

# కేబినెట్ భేటీ అనంతరం మంత్రులతో సీఎం భేటీ.. కీలక ఆదేశాలు



అమరావతి, జులై 16 :ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కాగా, ఈ భేటీ అనంతరం మంత్రులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. కూటమి ప్రభుత్వ పనితీరుపై నెల రోజుల పనితీరుపై చర్చించారు.

ప్రభుత్వం పూర్తిగా లోటు బడ్జెట్‌లో ఉందని గ్రహించి మెసలుకోవాలంటూ మంత్రులకు కీలక సూచనలు చేశారు. హెచ్ఓడీలతో సహా శాఖలకు సంబంధించిన సమస్యలపై నెలవారీ సమీక్షలు నిర్వహించాలని మంత్రులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ? తమ శాఖల పరిస్థితిని ప్రజలకు వివరించాలని సూచించారు.

పార్టీ కార్యాలయంలో మంత్రులు అందుబాటులో ఉండాల్సిందేనని.. మరోసారి స్పష్టం చేశారు చంద్రబాబు. అధికార దురభిమానం వద్దని మంత్రులకు హితవు పలికిన ఏపీ సీఎం.. ఎమ్మెల్యేలు సమన్వయంతో వెళ్లాలని మంత్రులకు చంద్రబాబు ఆదేశాలు.

# కష్టపడితే పదవులు వాటంతట అవేవస్తాయి

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్
## - రాయలకు ఘనంగా సన్మానం

ఖమ్మం, జులై 16 :(నేటినిజం ప్రతినిధి): కష్టపడితే పదవులు వాటంతట అవే వస్తాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ




దుర్గా ప్రసాద్ అన్నారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు పదవీ బాధ్యతలు స్వీకరించి తొలిసారి జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవనంలో డిసిసి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న డిసిసి అధ్యక్షులు మాట్లాడుతూ...పార్టీ కోసం కష్టపడే వారిని అధిష్టానం ఎప్పుడు గుర్తు పెట్టుకుంటుందని తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో రాయల నాగేశ్వర రావు పార్టీని చెక్కు చెదరకుండా కాపాడుకుంటూ వచ్చారని, కార్యకర్తలకు అండగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై తనదైన రీతిలో అప్పటి పాలక పక్షంపై పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎన్నో అవమానాలు ఎదుర్కొంటూ పార్టీ కట్టుబాటులను గౌరవిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేశారని తెలియజేశారు.

రాయల భవిష్యత్తులో మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ...కష్టపడే మనస్తత్వం ఉన్న వ్యక్తి రాయల నాగేశ్వర రావు అని అలాంటి వ్యక్తిని గుర్తించి కాంగ్రెస్ అధిష్టానం ప్రభుత్వంలో పదవి ఇవ్వడం శుభపరిణామం అని అన్నారు. మున్ముందు మరెన్నో పదవులు అలంకరించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు మాట్లాడుతూ... తనపై నమ్మకం ఉంచి పదవీ బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ కి కృతజ్ఞతలు తెలియజేశారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ నిర్ణయాలను ఏకీభవిస్తూ, తనకు అప్పగించిన పదవిలో నిబద్ధతతో నడుచుకుంటూ అందరి మన్నలను పొందుతానని తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, మాజీ ఏమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ.జావేద్, నాగండ్ల దీపక్ చౌదరి, పిసిసి సభ్యులు వడ్డే నారాయణ, ఖమ్మం జిల్లా ఓబీసీ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, జిల్లా మహిళా, ఐఎన్టీయూసీ, కిసాన్, సేవాదళ్, ఏస్సీ, మైనారిటీ సెల్ అధ్యక్షులు దొబ్బల సౌజన్య, కొత్తా సీతారాములు, మొక్క శేఖర్ గౌడ్, ఎస్డి గౌస్, బొడ్డు బొందయ్య, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, రాష్ట్ర కిసాన్, ఓబిసి సెల్ ఉపాధ్యక్షులు దాసరి దానియేలు, వడ్డేబోయిన నరసింహరావు, కార్పొరేటర్ లకావత్ సైదులు నాయక్, నగర ఓబిసి సెల్ అధ్యక్షులు బాణాల లక్ష్మణ్, మందపల్లి నాగమణి, ఉన్నం రాజశేఖర్, వివిధ మండలాల అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అందుకే ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు : మంత్రి పార్థసారథి

అమరావతి జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); : ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తూ మంత్రి వర్గ సమావేశం నిర్ణయించిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు.ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలే అమలు చేయలేదని పేర్కొన్నారు . గత వైసీపీ ప్రభుత్వం ఎవరితో చర్చించకుండానే చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. నీతిఅయోగ్ ప్రతిపాదిత చట్టానికి, గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి సంబంధం లేదని వివరించారు. ఈ చట్టం వివాదాలను పెంచే విధంగా ఉందని, ప్రజలకు మేలు చేసేదిగా లేదని అన్నారు.రెవెన్యూ , రిజిస్ట్రేషన్, ల్యాండ్ రికార్డ్సు వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసేందుకు చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుకపై కమిటీ వేసి పర్యవేక్షణ చేయడానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని అన్నారు. ఇసుకపై గత ప్రభుత్వం కోర్టులకు తప్పుడు సమాచారం ఇచ్చిందని అన్నారు. పాత ఇసుక విధానం, పలు ఒప్పందాలు రద్దు చేశామని తెలిపా రు.కౌలు రైతులకు మేలు చేసేందుకు కార్డులురాష్ట్రంలో కౌలు రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పార్థసా రథి పేర్కొన్నారు. కౌలు రైతుల సమ స్యలపై పూర్తిగా అధ్యయనం చేసిన తరువాత స్పష్టమైన విధానాన్ని తీసుకు వస్తామన్నారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించి ప్రపంచానికి ఒక ఆదర్శవం తమైన సాగును అందుబాటులోకి తీసుకురానున్నామని వివరించారు. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన మంత్రి వర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, సీఎస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తొలిసారి ప్రభుత్వం ఉత్తర్వులను తెలుగులో జారీ పట్ల తెలుగునాడు సమితి హర్షం

హైదరాబాద్ జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ప్రభుత్వ ఉత్తర్వులు మొట్టమొదటిసారిగా తెలుగులో జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి తెలుగునాడు సమితి అధ్యక్షులు గుమ్మడి హరిప్రసాద్ నేడొక ప్రకటనలో అభినందనలు తెలియజేశారు. ఇప్పటివరకు ఏ రాష్ట్ర ప్రభుత్వం చేయని విధంగా రైతు రుణమాఫీ మార్గదర్శకాలను ప్రజలందరికీ అర్థమయ్యే విధంగా తెలుగులో ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందని ఆయన తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉత్తర్వులు సహా, పరిపాలనకు సంబంధించిన అన్ని అంశాలు తెలుగులో జారీ చేయాలని ఎప్పటినుంచో తెలుగు భాషాభిమానులు, తెలుగు భాష పరిరక్షణ సంఘాలు సూచిస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణ మాఫీ మార్గదర్శకాలపై తెలుగులో ఉత్తర్వులు జారీ చేయడం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులు తొలిసారి తెలుగులో జారీ చేయడం చాలా సంతోషకరం అని తెలిపారు. "ప్రజల కోసమే పరిపాలన అయినప్పుడు ప్రజలకు సులువుగా అర్థమయ్యే భాషలోనే ప్రభుత్వ ఉత్తర్వులు, పరిపాలనకు సంబంధించిన సమాచారం ఉండాలని ఎప్పటినుంచో చెబుతున్నారు. ప్రజల సౌలభ్యానికి ప్రాధాన్యతనిస్తూ, తెలుగులో ఉత్తర్వులు జారీ చేసినందుకు తెలంగాణ ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్ రావు కి, ఈ ఉత్తర్వుల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇతర అధికారులు, సిబ్బందికి అభినందనలు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇక నుంచి అన్ని ఉత్తర్వులను, సమాచారాన్ని పూర్తిగా తెలుగులోనే అందించాలని తెలుగునాడు సమితి రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నది.

# ప్రజాపాలన గాలికి.. కొత్త రేషన్ కార్డుల జారీ ఇంకెప్పుడు?

**కాంగ్రెస్ సర్కారు విద్యార్థి, యువజన, నిరుద్యోగుల విరోధి.**
**పేరుకుపోయిన ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు.**
**సర్టిఫికెట్లు ఇచ్చేందుకు యాజమాన్యాలు నో..**
**ఉన్నతవిద్యకు పేద విద్యార్థులు దూరం..**
**ఎంఎస్ఎంఈలకు ఆగిపోయిన సబ్సిడీలు..**
**రూ.3,300 కోట్లకు పైగా బకాయిలు పెండింగ్**
**నత్తనడకన ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం స్కాం విచారణ..**
**రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీసిన**
**-బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్**

హైదరాబాద్ జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజాపాలనను గాలికి వదిలేసి, కేవలం మాటలు, మూటలు, మూటలతోనే కాలం వెళ్లదీస్తోందని బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డా. ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం పార్టీ కార్యాలయం లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశం లో పార్టీ అధికార ప్రతినిధులు ఎన్.వి.సుబాష్,సునితా రెడ్డి ,పార్టీ సీనియర్ నాయకులు పేరార శేకర్ రావు లతో కలిసి మాట్లాడారు. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, రైతులకు అనేక రకాల హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలులో మాత్రం వెనుకడుగు వేస్తోందన్నారు. రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లను ఏర్పాటు చేసుకున్నవారికి ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా పెండింగ్ లో ఉన్న రూ. 3,300 కోట్ల బకాయిలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా కూడా కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యారంటీ పథకాలను రేషన్ కార్డు ఉన్నవారికే ఇస్తామని చెప్పడంతో కార్డులు లేని వాళ్లు ఆ పథకాలను అందుకోలేక పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో స్కాం, సెక్రటేరియట్ నిర్మాణంలో అత్యధిక వ్యయానికి సంబంధించిన అంశాలపై విచారణ జరపడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుకడగు వేస్తోందని మండిపడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు ప్రజల పక్షాన బిజెపి పోరాటం చేస్తుందని ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్ వెల్లడించారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలు కొండలా పేరుకుపోయాయన్నారు. ముఖ్యమంత్రి నుంచి మొదలు సంబంధిత మంత్రుల వరకు ఫీజు రీయింబర్స్ మెంట్ త్వరలోనే చెల్లిస్తామని మాటలు చెప్పారు. ఇంతవరకు బకాయిలు చెల్లించింది లేదు.విద్యాసంస్థలకు ప్రభుత్వం సుమారు రూ. 6500 కోట్ల బకాయిలు చెల్లించాలి.రాష్ట్రంలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఈ)లకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు నిలిచిపోయాయి. సబ్సిడీ బకాయిలు చెల్లించాలి.రాష్ట్రంలో 15 వేల చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు ప్రభుత్వం వివిధ రకాల సబ్సిడీ కింద సుమారు రూ.3,300 కోట్ల బకాయి పడింది.ఫీజు రీయింబర్స్‌మెంట్‌పెండింగ్‌లో ఉండటంతో విద్యాసంస్థల మేనేజ్‌మెంట్లు సర్టిఫికెట్లు ఇవ్వడంలేదు. ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా




ఇవ్వాల్సిన పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు ఇవ్వలేదు.రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రుణాల మాఫీ పథకం అమలుకు కమిటీని నియమించినట్లు తెలిపింది. కాని, అమలులో మాత్రం ముందడుగు వేయలేదు.ప్రతి ప్రభుత్వ పథకానికి రేషన్ కార్డే ప్రామాణికం.. వివిధ రకాల ఉపకార వేతనాలు అందాలన్నా రేషన్ కార్డే ముఖ్యం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 7 నెలలు గడుస్తున్నా కూడా రేషన్ కార్డుల ఊసెత్తక పోవడంతో కార్డులు లేని వాళ్లు ప్రభుత్వ పథకాలను అందుకోలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే అర్హులందరికి రేషన్ కార్డులు మంజూరు చేయాలి.ప్రజాపాలన అంటూ మాటలు చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి కేవలం మాటలకే పరిమితమయ్యారు.ప్రజాభవన్ లో తొలినాళ్లలో లక్షల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. క్రమేణా తగ్గుతూ పదుల సంఖ్యకు పడిపోయింది.మూటలు కట్టడంలో ఆరితేరిన కాంగ్రెస్ నాయకులు.. మూటలను ఢిల్లీకి పంపడమే కర్తవ్యంగా పెట్టుకున్నారు.ఇప్పుడు శాసనసభ సమావేశాలు నిర్వహించి ఉద్ధరిస్తామంటూ వ్యవహారం నడుపుతున్నారు.ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, డ్రగ్స్ కేసు, సెక్రటేరియట్ నిర్మాణంలో భారీ వ్యయానికి సంబంధించిన విషయాల్లో విచారణ మూడు అడుగులు ముందుకు.. ఏడడుగులు వెనక్కి అన్న చందంగా మారింది.ప్రభుత్వ నియామకాలకు సంబంధించి పోటీ పరీక్షల మధ్య కాలవ్యవధి చాలా తక్కువ ఉండటం వల్ల అభ్యర్థులు ఇబ్బంది పడుతున్నారు. ఒక్కో పోటీ పరీక్ష మధ్య నిర్ణీత కాల వ్యవధి ఉండాలి. కాని, విద్యార్థులే, నిరుద్యోగుల మధ్య గొందరగోళం నెలకొంది. వైద్యశాఖలో అత్యవసర సేవలు అందించే గాంధీ, ఉస్మానియా, నీలోఫర్ వంటి ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులు ప్రైవేటు మెడికల్ షాపులకు వెళ్లి మందులు కొనుక్కొనే పరిస్థితి ఎదురైంది.ఈ అంశాలపై భారతీయ జనతా పార్టీ ప్రజల్లోకి వెళ్లి పోరాటం చేస్తుంది.

# ఖాతాలో రూ.65వేలు మాయం..

## బ్యాంకును ఆశ్రయించిన బాధితుడు

నిజామాబాద్, జులై 16 :బ్యాంకు ఖాతాదారుడి ప్రమేయం లేకుండానే ఖాతా నుంచి..రూ.65 వేలు మాయమైన ఘటన నిజామాబాద్ జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖలో విధులు నిర్వహిస్తున్న రత్నాకర్ ఖాతాలో నుంచి సుమారు రూ.65వేలు విత్ డ్రా అయినట్లు ఫోన్ కు మెసేజ్ రావడంతో కంగుతిన్నాడు.

ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ.. గత రెండు రోజుల నుంచి తన ఫోనుకు పదేపదే ఓటీపీలు వస్తున్నాయని తెలిపారు.

ఫోన్ కు వచ్చిన ఓటీపీలను ఎవరికీ షేర్ చేయలేదని అంతే కాకుండా ఎలాంటి లింకు ఓపెన్ చేయలేదని తెలిపారు. కానీ తన ఖాతా నుంచి డబ్బులు ఎలా పోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై న్యాయం చేయాలని శివాజీ నగర్ బ్రాంచ్ లో గల యూనియన్ బ్యాంకును ఆశ్రయించగా? బాధితుడి ఖాతా బ్యాంకు లావాదేవీ లకు సంబంధించి స్టేట్ మెంట్ ను పరిశీలించారు. ఈ విషయమై సైబర్ క్రైమ్ ని ఆశ్రయించాలని బ్యాంకు ఉద్యోగులు బాధితుడికి సూచించినట్లు తెలిపారు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ లో న్యాయం చేయాలని ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

# రాయలను ఘనంగా సన్మానించిన కాంగ్రెస్ ఓబీసీ నేతలు

ఖమ్మం, జులై 16 :(నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ గా పదవీ బాధ్యతలు స్వీకరించి మంగళవారం మొదటిసారిగా ఖమ్మం జిల్లాకి విచ్చేసిన రాయల నాగేశ్వరావుని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన కాంగ్రెస్ ఓబిసి ఖమ్మం జిల్లా అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి బమ్మిడి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు కమతం రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, తదితరులున్నారు.



# జిల్లా కలెక్టర్‌ని కలిసిన తుమ్మల యుగంధర్

ఖమ్మం, జులై 16 :(నేటినిజం ప్రతినిధి): ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు మంగళవారం ఐడిఓసి భవనంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఖమ్మం నియోజకవర్గం అభివృద్ధి, పెండింగ్ డెవలప్మెంట్ వర్క్స్ తదితర అంశాల గురించి జిల్లా కలెక్టర్ తో తుమ్మల యుగంధర్ సుదీర్ఘంగా వారు చర్చించారు. ప్రభుత్వ అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఇటీవలే తన దృష్టికి వచ్చిన ఖమ్మం నియోజవర్గం లో వివిధ సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.



# ముచ్చుమర్రిలో బాలికపై అత్యాచారం, హత్య ఘటన రోజుకో మలుపు

## -బాలిక మృతదేహాన్ని కేసి కెనాల్ నుంచి తీసి పుట్టితో శ్రీశైలం రిజర్వాయర్‌లోకి
## -బాలిక ఆచూకిని కనుగొనేంతరకు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్‌కెమెరా అండర్ వాటర్ స్కానర్‌ను ఉపయోగించి గాలింపు
## - ముచ్చుమర్రి బాలిక అదృశ్య ఘటనపై సంచలన విషయాలు వెల్లడించిన ఎస్పీ

అమరావతి జూలై 16 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలో బాలిక పై అత్యాచారం, హత్య ఘటన రోజుకో మలుపు తిరుగుతుంది. నిందితులతో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు వారి నుంచి కొత్త విషయాన్ని రాబట్టారు. దీంతో నిందితుల సంఖ్య ఐదుకు చేరుకుంది.గత వారం రోజుల క్రితం బాలికను ముగ్గురు మైనర్లు అత్యాచారం చేసి, చంపేసి హంద్రీనివా కేసీ కెనాల్‌లో పడేశారు. తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో విచారణ చేపట్టిన పోలీసులు ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకుని విచారించగా వారు నేరాన్ని అంగీకరించారు. అయితే బాలిక ఆచూకి కోసం వారం రోజులుగా కెనాల్‌లో ఎన్‌డీఆంఎఫ్ ఎస్డీఆర్ఎఫ్ , గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా బాలిక ఆచూకిని గుర్తించలేక పోయారు.బాలికను పూడ్చిపెట్టామని నిందితులు మరోసారి మాటమార్చడంతో పోలీసులు బుల్‌డోజర్లతో ఆ ప్రాంతాన్ని గాలించిన ఫలితం రాలేదు. అయితే నిందితులకు సంబంధించిన మరో ఇద్దరిని అదుపులోకి విచారించిన పోలీసులకు మరో షాకింగ్ విషయం బయటపడింది.



బాలిక మృతదేహాన్ని కేసి కెనాల్ నుంచి తీసి పుట్టితో శ్రీశైలం రిజర్వాయర్ మధ్య వరకు తీసుకెళ్లి బండరాళు కట్టి పడేశారని నంద్యాల జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ మీడియా సమావేశంలో సంచలన విషయాన్ని వెల్లడించారు.దీంతో పోలీసులు శ్రీశైలం రిజర్వాయర్ లో గాలింపు మొదలు పెట్టారని ఆయన తెలిపారు. బాలిక ఆచూకిని కనుగొనేంతరకు అత్యాధునిక, సాంకేతిక పరిజ్ఞానం, డ్రోన్‌కెమెరా , అండర్ వాటర్ స్కానర్‌ను ఉపయోగించి గాలింపు కొనసాగుతుందని అన్నారు. నిందితులను, వారి ఇద్దరు బంధువులను అరెస్టు చేశామని ఆయన వివరించారు.

# హెచ్ఐవీ నిర్మూలనకు సూది మందు.. పరీక్షలు విజయవంతం..!




హైదరాబాద్, జులై 16: : హెచ్ఐవీ ఇన్ఫెక్షన్ నుంచి మనుషులను కాపాడేందుకు తయారు చేసిన సూది మందు పరీక్షలు విజయవంతమయ్యాయి. దక్షిణాఫ్రికా, ఉగాండాలలో నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ సత్ఫలితాలను చూపించాయి. లెనకపవిర్ ఇంజెక్షన్ ను ఆరు నెలలకు ఒకసారి చొప్పున, ఏడాదికి రెండుసార్లు ఇవ్వడంవల్ల యువతులను హెచ్ఐవీ నుంచి కాపాడవచ్చని ఈ పరీక్షల్లో స్పష్టమైంది.

రోజువారీ మాత్రల రూపంలో ఉన్న ఇతర హెచ్ఐవీ ఔషధాల కన్నా లెనకపవిర్ ఇంజెక్షన్ మెరుగైనదా.. కాదా..? అనే అంశాన్ని ఈ పరీక్షల్లో విశ్లేషించారు. ఈ మూడు ఔషధాలు ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్ఈపీ) డ్రగ్స్ అని పరిశోధకులు తెలిపారు. ఈ ఇంజెక్షన్‌ను అందరికీ అందుబాటులోకి తేవడానికి ప్రయత్నిస్తున్నట్లు గిలీడ్ సైన్సెస్ ఓ ప్రకటనలో తెలిపింది.

# ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షలు చోరీ.. జడ్చర్లలో ఘటన



జడ్చర్ల, జూలై 16 : ఆర్టీసీ బస్సులో రూ.36 లక్షలు చోరీక గురైన ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో మంగళవారం చోటు చేసుకున్నది. జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామోదర్ అనే వ్యక్తి హైదరాబాద్ ట్రాన్స్‌కో డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తి స్తున్నాడు.

అయితే, కర్నూల్‌లో ఉంటున్న చెల్లెలి అవసరం నిమిత్తం తన పీఎఫ్, జీపీఎఫ్ డబ్బుల నుంచి రూ.36 లక్షలు తీసుకొని హైదరాబాద్‌లోని జేబీఎస్ బస్టాండ్‌లో పికెట్ డిపోకు చెందిన (టీఎస్09జెడ్7840) బస్సులో ఎక్కాడు. ఈ బస్సు హైదరాబాద్ నుంచి కడప వెళు తున్నది. డబ్బులు ఉన్న బ్యాగును సీటుపై ఉన్న క్యాబిన్‌లో పెట్టాడు.

జడ్చర్ల బస్టాండ్‌లో టీ కోసం పది నిమిషాలు బస్సును నిలుపగా.. దామోదర్ టిఫిన్ చేయడానికి బ్యాగు తీసు కొని కిందకు దిగాడు. బ్యాగు బరువులో తేడా అనిపించడంతో తెరిచి చూడగా.. అందులో నాలుగు అరలీటర్ వాటర్ బాటిళ్లు దర్శనమిచ్చాయి. గుర్తు తెలియని వ్యక్తులు డబ్బులు అపహరించినట్లు గుర్తించిన దామోదర్ జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బస్సును పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ ఆదిరెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. బస్సులోని సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు. అయితే, బస్సులో ఒక వ్యక్తి అటూఇటూ అనుమానాస్పదంగా తిరిగినట్లు బాధితుడు తెలిపాడు. దామోదర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు.

# సికింద్రాబాద్-భావ్‌నగర్ మధ్య ప్రత్యేక రైళ్లు ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే..

హైదరాబాద్, జులై 16: : ప్రయాణికులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు చెప్పింది. సికింద్రాబాద్-భావ్‌నగర్‌తో పాటు పలు ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. సికింద్రాబాద్-భావనగర్ (07061) మధ్య ఈ నెల 19, 26, ఆగస్టు 2, 9వ తేదీల్లో రైలు రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటిరోజు 5.55 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని పేర్కొంది. భావ్‌నగర్-సికింద్రాబాద్ (07062) రైలు ఈ నెల 21, 28, ఆగస్టు 4, 11 తేదీల్లో ఉదయం 10.15 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 3.45 గంటలకు గమ్యస్థానం చేరుతుందని తెలిపింది.

ఈ రైళ్లు రెండుమార్గాల్లో మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ముఖ్దేడ్, నాందేడ్, పూర్ణ, బస్మత్, హింగోలి, వాషిమ్, అకోల, భుస్వాల్, నందుర్బర్, సూరత్, వడోదర, అహ్మదాబాద్, విరాంగమ్, సురేంద్ర నగర్, ధోలా, సోంగడ్ తదితర స్టేషన్లలో ఆగుతాయని పేర్కొంది. బెంగళూరు-కాలబురిగి (06533) మధ్య ఈ నెల 19, కాలాబురిగి-బెంగళూరు (06534) మధ్య ఈ నెల 20న ప్రత్యేక రైళ్లు నడుస్తాయని దక్షిణ మధ్య రైల్వే వివరించింది. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను తీసుకువచ్చినట్లు పేర్కొంది.

# కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే తలసాని

హైదరాబాద్, జులై 16: :నిరుపేద కుటుంబాల్లోని ఆడపిల్లల వివాహాలు భారం కావొద్దని నాటి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకాలను ప్రవేశపెట్టింది. ప్రభుత్వం అందజేస్తున్న కల్యాణ లక్ష్మి చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లి కమ్యూనిటీ హాలులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎమ్మెల్యే తలసాని, మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారితో కలిసి లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మిచెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని, ఆ దృష్టితోనే పేదల బస్తీల్లో మల్టీపర్పస్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. నామమాత్రపు అద్దెలకే పేదలకు అందుబాటులోకి తీసుకొచ్చిందని గుర్తు చేశారు. అర్హులైన



ప్రతిఒకరు ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అశోక్‌యాదవ్, దాడి ప్రవీణ్‌రెడ్డి, కూతురు నర్సింహ, బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు వెంకటేశన్ రాజు, ఏసూరి మహేష్, కూర్మ లక్ష్మిపతి, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు వరకు నీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యం- ఎమ్మెల్యే బండ్ల

మహబూబ్‌నగర్, జులై 16 :గద్వాల నియోజకవర్గంలోని ధరూర్ మండలం పరిధిలో ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా కుడికాలువకు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చేతుల మీదుగా ఇవాళ కృష్ణమ్మ తల్లికి పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. ర్యాలంపాడు రిజర్వాయర్ నీళ్లు విడుదల చేసి ప్రారంభించి రైతులకు సకాలంలో నీటిని అందించారు.

రైతులు సమన్వయంతో నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు,



వ్యవసాయానికి అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. ప్రస్తుతం వానకాలం కావడంతో రైతులు వ్యవసాయ పనులకు సిద్ధమయ్యారని, కావున రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సరైన సమయంలో నీటిని విడుదల చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గత సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా రైతులకు రెండు పంటలకు చివరి ఆయకట్టు వరకు ప్రతి సన్నకారు రైతులకు సాగునీరు అందించాలనే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఎగువ భాగంలో భారీ వర్షాలు కురుస్తుండటం వల్ల ఐదారు రోజుల్లో జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండుకుంటుందని, అనంతరం రిజర్వాయర్లు నింపుతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి పటేల్ ప్రభాకర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిమ్మారెడ్డి, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ జెడ్పీటీసీ ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి రామకృష్ణ నాయుడు, కాంగ్రెస్ పార్టీ నాయకులు సత్యం రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, డీ.ఆర్ విజయ్, భీమ్ రెడ్డి ప్రభాకర్ గౌడ్, డి.వై రామన్న, ఆనంద్ గౌడ, చంద్రశేఖర్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి విజయ్ రెడ్డి, నాగన్న, రంగస్వామి, కురుమన్న, రాఘవేంద్ర రెడ్డి, శ్రీరాములు, ఆనంద్ రెడ్డి, ఆలీ సురేష్, గోవిందు, ధర్మ నాయుడు, సవారన్న పురుషోత్తం రెడ్డి సంతోష్, పూడూరు చిన్నయ్య, రాజు, ఈ.ఈ రైముద్దీన్, నీటి పారుదల శాఖ అధికారులు, నాయకులు, కార్యకర్తలు, యూత్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# వారికి రేషన్ కార్డులు జారీ చేయాల్సిందే..

హైదరాబాద్, జులై 16: :రేషన్ కార్డుల కోసం ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికుల వెరిఫికేషన్ ప్రక్రియను వివిధ రాష్ట్రాలు ఆలస్యం చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఇలాంటి పరిస్థితి చాలా దురదృష్టకరమని వ్యాఖ్యానించింది. ఈ క్రమంలోనే తాజాగా కీలక ఆదేశాలు వెలువరించింది.

వలస కార్మికుల రేషన్ కార్డుల వెరిఫికేషన్‌ను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించింది. ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బతుకుదెరువు కోసం వచ్చిన వలస కార్మికులకు 4 వారాల్లోగా ప్రక్రియను మొత్తం పూర్తి చేసి.. రేషన్ కార్డులు అందించాలని ఆదేశాలు వెలువరించింది. ఒకవేళ రాష్ట్రాలు ఈ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయలేకపోతే ఆయా రాష్ట్రాల కార్యదర్శులకు సమన్లు జారీ చేస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీనిపై తదుపరి విచారణను ఆగస్టు 27వ తేదీకి వాయిదా వేసింది.

అయితే, ఈ-శ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ.. ఇప్పటికీ.. దేశంలోని చాలా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు.. వెరిఫికేషన్ పూర్తి చేయకపోవడం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇప్పటివరకు తెలంగాణ, బిహార్ రాష్ట్రాలు మాత్రమే వలస కార్మికుల రేషన్ కార్డుల జారీ కోసం 100 శాతం వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశాయి.

# తెలంగాణ పోలీసులకు డీజీపీ జితేందర్ కీలక ఆదేశాలు..!



హైదరాబాద్, జులై 16: :ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి ప్రభుత్వం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం ద్వారా అందించిన దరఖాస్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని డీజీపీ జితేందర్ పోలీసులను ఆదేశించారు. పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలతో మంగళవారం కార్యాలయంలో డీజీపీ సమావేశమయ్యారు. ఆయా జిల్లాలు, కమిషనరేట్‌లకు పంపిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఈ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించడంతో ప్రజలు సంతృప్తి చెందుతారన్నారు. పోలీస్ స్టేషన్లలో వచ్చే ఫిర్యాదుల ఆధారంగా వెంటనే కేసులు నమోదు చేయాలని, ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని డీజీపీ ఆదేశించారు.

పోలీస్ కమిషనర్లు, ఎస్పీలు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీ చేయాలని చెప్పారు. తాను సైతం త్వరలోనే జిల్లాల వారీగా తనిఖీల చేపడుతానని తెలిపారు. తనతోపాటు పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కూడా వివిధ జిల్లాల్లో తనిఖీలు చేపడతారని పేర్కొన్నారు. హిస్టరీ షీట్‌ల సమీక్షించాలని, ఆయుధాల లైసెన్స్‌ల జారీపై జాగ్రత్త వహించాలని, శాంతి భద్రతలు మెరుగైన నిర్వాహణ, ఎస్సీ, ఎస్టీలు, మహిళలకు సంబంధించిన కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. 'నేను సైతం' కార్యక్రమం ద్వారా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించడంతోపాటు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు.

స్టేషన్ హౌస్ ఆఫీసర్ల పనితీరును అంచనా వేసేందుకు నేర సమీక్ష సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సీఎం దార్శనికతకు అనుగుణంగా, రాష్ట్రంలో డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. అవసరమైతే ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలను నిర్వహించాలని ప్రతిపాదించారు. సమావేశంలో లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీ మహేశ్ భగవత్, హైదరాబాద్ సీపీ కే శ్రీనివాస్ రెడ్డి, అదనపు డీజీపీలు శిఖా గోయెల్, అభిలాష బిష్త్, వీవీ శ్రీనివాస్ రావు, విజయ్ కుమార్, స్టీఫెన్ రవీంద్ర కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పార్టీ ఫిరాయించిన వారిపై చర్యలు తీసుకోండి-స్పీకర్ కు బి ఆర్ ఎస్ వినతి

**-స్పీకర్ ను కలసిన కెటిఆర్ నేతృత్వంలోని బిఆర్ఎస్ బృందం**
**-తక్షణం వారిని అనర్హులుగా ప్రకటించాలని విన్నపం**
**-మూడు నెలలో చర్యలు తీసుకోవాలన్న సుప్రీం తీర్పును**
**-స్పీకర్ దృష్టికి తెచ్చిన కెటిఆర్**
**-ప్రొటోకాల్ ఉల్లంఘనపై కూడా సభాపతికి పిర్యాదు**

హైదరాబాద్, జులై 16: :బిఆర్ ఎస్ నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను కోరింది బిఆర్ఎస్ ప్రతినిధుల బృందం.. మాజీ మంత్రి, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నాయకత్వంలోని ఎమ్మెల్యేల బృందం నేడు స్పీకర్ ను ఆయన కార్యాలయంలో కలిసింది. ఈ సందర్భంగా

నియోజకవర్గాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘనలు పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు కెటిర్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఆయన వివరాలతో కూడిన లేఖను అందజేశారు.

అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, ప్రొటోకాల్ ఉల్లంఘనలు, పార్టీ ఫిరాయింపులపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని సభాపతి దృష్టికి తెచ్చామన్నారు.

పది మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారన్నారు. ఫిరాయింపులపై సుప్రీం కోర్టు తీర్పును సభాపతికి గుర్తు చేశామన్నారు. ఫిరాయింపులపై వచ్చిన ఫిర్యాదులపై 3 నెలల్లో చర్యలు తీసుకోవాలని కోర్టు తెలిపిందన్నారు. సుప్రీం కోర్టు తీర్పును స్పీకర్‌కు చదివి వినిపించా అని కేటీఆర్ అన్నారు.



కాంగ్రెస్ తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా న్యాయ్ పత్ర అంటూ మేనిఫెస్టో విడుదల చేసిందని అందులో స్పష్టంగా ఫిరాయింపులు చేసిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేస్తామని హామీ ఇచ్చిందని కేటీఆర్ గుర్తు చేశారు. హర్యానాలో కాంగ్రెస్ ఎమ్మెల్యే బీజేపీలో చేరితే ఇదే హస్తం పార్టీ కొట్లాడుతోందని తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను బీజేపీ రూ.50 కోట్లకు కొంటుందని సీఎం సిద్ధరామయ్య ఆరోపిస్తున్నారని కేటీఆర్ గోవాలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు బీ ఫామ్ ఇచ్చే సందర్భంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వారితో పార్టీ మారబోమని ప్రమాణం చేయించారని గుర్తు చేశారు. హిమాచల్ రాజ్యసభ ఎన్నికలు, మహారాష్ట్ర పరిణామాలను స్పీకర్ గడ్డం ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనలన్నింటిని దృష్టిలో ఉంచుకుని తెలంగాణలో పార్టీ మారిన ఎమ్మెల్యేల సభ్యత్వాలు వెంటనే రద్దు చేయాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని స్పీకర్ హామీ ఇచ్చినట్లు చెప్పారు.

# 2,424 ఖాళీల భర్తీకి నోటిఫికేషన్..

హైదరాబాద్, జులై 16: :సెంట్రల్ రైల్వే 'రిక్రూట్‌మెంట్ సెల్' మొత్తం 2,424 ఖాళీల భర్తీకి (మంగళవారం) దరఖాస్తులను ఆహ్వానించింది. వివిధ అప్రెంటీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆగస్టు 15లోగా అధికారిక వెబ్‌సైట్ rrccr.comలో దర ఖాస్తును సమర్పించాలని పేర్కొంది.

10వ తరగతిలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అదనంగా నేషనల్ కౌన్సిల్ ఫర్ వొకేషనల్ ట్రైనింగ్ లేదా స్టేట్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ ద్వారా గుర్తింపు పొందిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికేట్ కూడా సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారుల వయసు 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీకి 3 ఏళు సడలింపు ఇస్తున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది.

కాగా అభ్యర్థులు మ్యాథ్స్, ఐటీఐలో సాధించిన మార్కుల సగటు ఆధారంగా మెరిట్ లిస్టును తయారు చేస్తారు. షార్ట్‌లిస్ట్‌కు ఎంపికైన అభ్యర్థులను సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్ కోసం పిలుస్తారు. కాగా మరింత సమాచారం కావాలనుకున్న అభ్యర్థులు సెంట్రల్ రైల్వేస్ అధికారిక వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి తెలుసుకోవచ్చు.

# సింగరేణి బొగ్గు వినియోగదారులతో సమన్వయానికి ప్రత్యేక సెల్ ఏర్పాటు : సింగరేణి చైర్మన్

హైదరాబాద్, జులై 16: :రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న అనేక పరిశ్రమలకు బొగ్గునందిస్తున్న సింగరేణి సంస్థతన వినియోగదారుల పట్ల స్నేహపూరితంగా వ్యవహరిస్తుందని సింగరేణి సంస్థ చైర్మన్ , ఎండీ ఎన్. బలరామ్ పేర్కొన్నారు. వారిని వినియోగదారులుగా కాకుండా ప్రగతి భాగస్వాములుగా గుర్తిస్తోందని, వారి సౌకర్యం కోసం ఒక ప్రత్యేక సమన్వయ సెల్ ను కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు.

హైదరాబాద్ సింగరేణి భవన్ లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ-వేలం వినియోగదారులు, వ్యాపారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా, సమాచార లోపం లేకుండా ఉండేందుకు ఒక ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. దేశంలోని ఏ ఇతర బొగ్గు సంస్థల్లో లేనివిధంగా సింగరేణిలో ఈ-వేలం వినియోగదారులకు అనేక వెసులుబాట్లను కల్పించామన్నారు.

కోల్ ఇండియాలో ఈ-వేలం సేల్ ఆర్డర్ కాలపరిమితి కేవలం 45 రోజులు ఉండగా సింగరేణిలో ఇది 90 రోజులుగా ఉందని పేర్కొన్నారు. ఎవరైనా వినియోగదారులు ఈ కాల పరిమితిని ఇంకా పెంచమని సమంజసమైన కారణం చూపితే వారికి మరో 90 రోజుల పాటు సేల్ ఆర్డర్‌కాల పరిమితిని పెంచే వెసులుబాటును కలిగిస్తున్నామన్నారు. ఈ సౌకర్యం కోల్ ఇండియాలో లేదని తెలిపారు.

ఎవరైనా ఈ-వేలం వినియోదారుడు బొగ్గు తీసుకుంటున్న క్రమంలో సేల్ ఆర్డర్‌ను రద్దు చేసుకోవాలి అనుకుంటే ఆన్‌లైన్ ద్వారా ఆ విషయాన్ని తెలియజేస్తే , రద్దు ప్రక్రియకు అంగీకరించటమే కాక వెంటనే సంబంధిత బొగ్గు డిపాజిట్ ను వెనక్కి చెల్లిస్తామని వెల్లడించారు.

సింగరేణి బొగ్గుని వినియోగిస్తున్న సుమారు 80 కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని పలు సూచనలు చేశారు. సమావేశంలో మార్కెటింగ్ జనరల్ మేనేజర్ జి.దేవేందర్, అడిషనల్ జనరల్ మేనేజర్ ఎన్.వి. రాజశేఖర్ రావు, డిప్యూటీ జనరల్ మేనేజర్ రవివాస్తవ తదితరులు పాల్గొన్నారు.

# అందుకే ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు : మంత్రి పార్థసారథి

అమరావతి, జులై 16 :ఆంధ్రప్రదేశ్‌లో ల్యాండ్ అండ్ టైటిలింగ్ యాక్ట్ ను రద్దు చేస్తూ మంత్రి వర్గ సమావేశం నిర్ణయించిందని మంత్రి పార్థసారథి వెల్లడించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబుఅధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మంత్రి మీడియాకు వెల్లడించారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టంపై అనేక సందేహాలు ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాన్ని బీజేపీ పాలిత రాష్ట్రాలే అమలు చేయలేదని పేర్కొన్నారు . గత వైసీపీ ప్రభుత్వం ఎవరితో చర్చించకుండానే చట్టాన్ని తీసుకొచ్చిందని ఆరోపించారు. నీతిఅయోగ్ ప్రతిపాదిత చట్టానికి, గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి సంబంధం లేదని వివరించారు. ఈ చట్టం వివాదాలను పెంచే విధంగా ఉందని, ప్రజలకు మేలు చేసేదిగా లేదని అన్నారు.

రెవెన్యూ , రిజిస్ట్రేషన్, ల్యాండ్ రికార్డు వ్యవస్థను పూర్తిగా ధ్వంసం చేసేందుకు చట్టాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఉచిత ఇసుకపై కమిటీ వేసి పర్యవేక్షణ చేయడానికి మంత్రి వర్గం ఆమోదం తెలిపిందని అన్నారు.

ఇసుకపై గత ప్రభుత్వం కోర్టులకు తప్పుడు సమాచారం ఇచ్చిందని అన్నారు. పాత ఇసుక విధానం, పలు ఒప్పందాలు రద్దు చేశామని తెలిపారు.

కౌలు రైతులకు మేలు చేసేందుకు కార్డులు

రాష్ట్రంలో కౌలు రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని మంత్రి పార్థసారథి పేర్కొన్నారు. కౌలు రైతుల సమస్యలపై పూర్తిగా అధ్యయనం చేసిన తరువాత స్పష్టమైన విధానాన్ని తీసుకువస్తామన్నారు. రాబోయే రోజుల్లో 50 లక్షల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించి ప్రపంచానికి ఒక ఆదర్శవంతమైన సాగును అందుబాటులోకి తీసుకు రానున్నామని వివరించారు. దాదాపు రెండున్నర గంటల పాటు కొనసాగిన మంత్రి వర్గ సమావేశంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, సీఎస్, ఇతర శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

**-ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అర్హులైన డ్రైవర్లకు రిజర్వేషన్ కల్పించాలి**
**-డ్రైవర్ల పిల్లలకు విద్యా ఉద్యోగ ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలి**
**-రవాణా శాఖ మంత్రి జిల్లా నుంచి డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఉద్యమం ప్రారంభించాం**
**-ప్రభుత్వం మా డిమాండ్లను పరిశీలించి అమలు చేస్తుందని ఆశిస్తున్నాం**
**-బస్టాండ్ నుంచి లేబర్ కమిషనర్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించిన డ్రైవర్లు లేబర్ కమిషనర్ కు వినతిపత్రం**
**-టిఆర్ సిపిటియు రాష్ట్ర అధ్యక్షుడు కౌడ సతీష్ కుమార్**




కరీంనగర్, జులై 16 : (నేటినిజం ప్రతినిధి) తెలంగాణ రాష్ట్రంలో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచి ఇప్పుడు అమలు చేయమంటే తాత్సారం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిపించడానికి సంక్షేమ బోర్డు సాధన కోసం డ్రైవర్ల ఐక్యతను చాటడానికి తెలంగాణ రాష్ట్ర క్యాబ్స్ ప్రొటెక్ట్ ట్రేడ్ యూనియన్ ( టీ ఆర్ సి పి టి యు ) కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కౌడ సతీష్ అధ్యక్షతన కరీంనగర్ బస్టాండ్ సెంటర్ నుండి జిల్లా లేబర్ కమిషనర్ కార్యాలయ వరకు మహా పాదయాత్ర నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సెంటర్లో జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం తమ డిమాండ్లను ప్రభుత్వం అంగీకరించి ఆమోదించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం లేబర్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా టి ఆర్ సి పి టి యు రాష్ట్ర అధ్యక్షులు కౌడ సతీష్ మాట్లాడుతూ తెలంగాణ లో డ్రైవర్ లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ, డ్రైవర్లకు తెల్లరేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని, అర్హులైన డ్రైవర్లకు కార్పొరేషన్ ల ద్వారా వాహనాలు అందించాలని, ఎం.వి యాక్ట్ -2019 రద్దు చేయాలని, హిట్ ఉ రన్ చట్టాన్ని తెలంగాణ లో అమలు చేయరాదని అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం మానిఫెస్టోలో పెట్టి హామీ ఇచ్చిన విధంగా డ్రైవర్లకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలనీ కోరుతూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది అని తెలిపారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ జిల్లా నుంచి ఈ డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధన ఉద్యమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు డ్రైవర్ల పిల్లలకు విద్యా ఉ ద్యోగ ఉపాధి రంగాల్లో ప్రాధాన్యత కల్పించాలని డ్రైవర్ల కు ప్రభుత్వ సంక్షేమ పథకాలు రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేశారు డ్రైవర్ల సంక్షేమ బోర్డు అమలు చేసినప్పుడే డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వతంగా పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా తక్షణమే డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమాలను ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. డ్రైవర్ల జీవితాలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఈ కార్యక్రమం లో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగరాజు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ అఫ్జల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమాజి, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు షేక్ మీరా సాహెబ్, మల్లేశం, కరీంనగర్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అంకుశావలి, వైస్ ప్రెసిడెంట్ కొట్టె సంపత్ రెడ్డి, కొట్టె శ్రీనివాస్ , పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులు వీరేశం కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కమిటీ సభ్యులు రెండు జిల్లాల డ్రైవర్లు పాల్గొన్నారు.

# కొండచరియలు విరిగిపడి.. ఐదుగురు మృతి..

న్యూఢిల్లీ, జులై 16 :కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో గత రెండు రోజులుగా కుండపోత వర్షాలు కురుస్తున్నాయి. తాజాగా ఉత్తర కన్నడ జిల్లా షిరూర్‌లోని అంకోలా హైవేపై మంగళవారం భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతులు 66వ నెంబరు జాతీయ రహదారిపై రోడ్డు పక్కనే చిన్నపాటి హోటల్ నడుపుతున్న కుటుంబ సభ్యులుగా గుర్తించారు.

మరోవైపు కొండచరియలు విరిగిపడటంతో ఓ గ్యాస్ ట్యాంకర్ సమీపంలోని గంగావళి నదిలో పడిపోయిందని అధికారులు చెబుతున్నారు. కొండచరియలు విరిగిపడి మరణించిన వారి సంఖ్య ఏడుకు చేరింది. కొండచరియలు విరిగిపడటంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# కాలక్షేపం కోసమే శ్వేతపత్రాలు విడుదల.. చంద్రబాబుపై పేర్నినాని మండిపాటు

అమరావతి, జులై 16 :ఏపీలో అధికార మార్పిడి జరిగిన తరువాత చంద్రబాబు శ్వేతపత్రాలు విడుదల చేస్తూ కాలక్షేపం చేస్తున్నారని మాజీ మంత్రి పేర్ని నాని విమర్శించారు. మంగళవారం తాడేపల్లిలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. శ్వేతపత్రంలో అన్ని అసత్యపు ఆరోపణలే ఉంటున్నాయని , ఇప్పటి వరకు ఏ ఒక్కటి నిరూపితం చేయాలేదని ఆరోపించారు.

అధికారం చేపట్టి 35 రోజులు కావస్తున్నా ఇచ్చిన హామీల్లో పెన్షను తప్ప ఏమీ చేయలేదని మండిపడ్డారు. మాజీ సీఎం వైఎస్ జగన్ తిట్టడమే పని పెట్టుకున్నారని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టు ను ఎప్పుడు పూర్తి చేస్తారో చెప్పడం లేదని ఆరోపించారు. అమరావతి సంగతి కూడా అంతేనని విమర్శించారు. 40 ఏళ్ల రాజకీయ చరిత్ర, 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసిన చంద్రబాబు అనుభవం పనికిరాకుండా ఉందని వెల్లడించారు.

కూటమి ప్రభుత్వం 2024-25 రాష్ట్ర బడ్జెట్ ప్రవేశ పెట్టలేని పరిస్థితి ఉందని అన్నారు. జగన్‌కు అనుభవం లేకున్నా సరైన సమయానికి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని తెలిపారు. చంద్రబాబు సీఎంగా ప్రమాణస్వీకారానికి 48 గంటల ముందు కేంద్రం నుంచి డబల్ డబ్యులేషన్ కింద రూ. 5,600 కోట్లు ఖజానకు వచ్చిందని వివరించారు.

# కేరళ మోడల్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఘనంగా పోచమ్మ బోనాలు



రాజన్న సిరిసిల్ల, జులై 16 :(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలోని సాయి నగర్ మరియు ఉపగడ్డ వీధిలో గల కేరళ మోడల్ స్కూల్లో ఆషాడమాసం తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాల నిర్వహించే బోనాల పండుగను మంగళవారం రోజున అత్యంత వైభవంగా నిర్వహించారు ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పోతరాజులు మరియు అమ్మవారి వేషధారణతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు యాజమాన్యం మరియు ఉపాధ్యాయ బృందం బద్ది పోచమ్మ అమ్మవారికి ఎంతో భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని ఆలయం వరకు డప్పు చప్పుళ్ళ మధ్య ఆటపాటలతో తీసుకువచ్చి అమ్మవారికి ఘనంగా బోనం సమర్పించారు ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మనోజ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించే బోనాల పండుగ యొక్క ప్రాముఖ్యతను వివరించారు ఆ అమ్మవారి దయతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలతో మంచి జీవితం గడపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

# అల్ఫోర్స్‌లో ఘనంగా డాజిలే ఉత్సవాలు




కరీంనగర్, జులై 16 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ పట్టణంలోని భగత్ నగర్ లోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో ప్రపంచ డాజిల్ డే ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్ఫోర్స్ సంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ వేడుకలను చాలా వినోదాత్మకంగా ఆలోచింపచేసే విధంగా వివిధ భోదనా పద్ధతుల ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని కలిగించి విషయాలను గుర్తు పెట్టుకునేలా చేశారు. ప్రత్యేకంగా చిన్నారులకు వివిధ రకాల వస్తువుల ద్వారా ఆసక్తిని కలిగించి ఉషారుగా చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు సమాజంలో వెలువడుతున్న మార్పుల గూర్చి తెలియజేవల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలుపుతూ డాజిల్ డే చాలా వినూత్నమైన వేడుకలని మరియు దీని ద్వారా భేదం చూపెట్టే విధానాలు కూడా తెలుసుంటారని తెలిపారు. దీని ద్వారా ప్రతిఒక్కరు వారి గ్రహించే శక్తిని పెంపొందించుకోవడమే కాకుండా సమతుల్యానికి తగిన చర్యలు తీసుకుంటారని డాజిల్ డే ద్వారా ప్రతిఒక్కరు ఏ విధంగా ఉషారుగా ఉంటారో తెల్సుకోవడమే కాకుండా వివిధ కార్యకలాపాలను నిర్వర్తించే విధి విధానాలను కూడా తెలుసుకుంటారని చెప్పారు. డాజిల్ డేకు పాఠశాలలో చాలా విశిష్టత ఉందని దీని ద్వారా జీవితాన్ని చాలా గొప్పగా మల్చుకోవచ్చని చెప్పారు. ప్రత్యేకంగా పాఠశాలలోనితరగతి గదులను చాలా ఆకర్షనీయంగా అలంకరించి విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని పెంపొందించారు. విద్యార్థులు ప్రదర్శించిన ఓ వండర్..... మై వండర్, మై లైఫ్ ఇస్ వండర్ఫుల్ ఉ భ్యూటీవుల్ తదీతర నృత్యాలు చాలా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ , బిఆర్ఎస్ మైనార్టీ నాయకులవి మతిలేని వ్యాఖ్యలు.

**-కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ ని అన్ని పార్టీల నేతలు కలుస్తారు.. అందులో తప్పేముంది..?**
**-కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్డీఏ బిజెపి ప్రధాని మోదిని ఎందుకు కలుస్తున్నారు..?**
**-స్వార్థ రాజకీయాల కోసం మతాన్ని అడ్డుపెట్టుకొని , ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి కాంగ్రెస్ బిఆర్ఎస్ లు ప్రయత్నిస్తున్నాయి..**
**-బిజెపి మైనారిటీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ వ్యాఖ్యలు...**



కరీంనగర్, జులై 16 : (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ అభివృద్ధి కోసం కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ను అన్ని పార్టీల నేతలు కలుస్తుంటే, కొంతమంది కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలు అక్కసు వెళ్లగకుతున్నారని , తమ స్వార్థ రాజకీయాల కోసం బండి సంజయ్ కుమార్ పై పనికిమాలిన విమర్శలు చేస్తూ ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నం చేస్తున్నారని , దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బిజెపి మైనార్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి ముజీబ్ అన్నారు. మంగళవారం కరీంనగర్లో ఆయన కరీంనగర్లో మాట్లాడుతూ ఈద్గా, మసీదుల విషయంలో బండి సంజయ్ కుమార్ మాట్లాడిన వ్యాఖ్యలను కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతలు వక్రీకరించి ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నాలు చేయడం మంచిదిక దన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి అన్ని వర్గాల ప్రజలు, ఇతర పార్టీల నేతలు కలుస్తున్నారన్నారని, ఇందులో ముఖ్యంగా కరీంనగర్ అభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందించాలని కేంద్ర మంత్రిని కోరుతు అనేకమంది విజ్ఞప్తులు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎన్డీఏ బిజెపి ప్రధాని మోదీని ఎందుకు కలుస్తున్నారో అలాగే ఇతర పార్టీల నేతలు కూడా కేంద్రమంత్రి బండి సంజయ్ ని కలిస్తే దాన్ని కూడా రాజకీయం చేయడం అవివేకమన్నారు. ఇందులోకేవలం ఎంఐఎం , బిజెపి టార్గెట్ గా కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతలు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బి ఆర్ ఎస్, కాంగ్రెస్ పార్టీ లు పరస్పరం విమర్శలు చేసుకునే పరిస్థితుల్లో లేరని, రెండు పార్టీలు కలిసిపోయాయని, కేవలం బిజెపి లక్ష్యంగా పనికిమాలిన రాజకీయాలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్, బి ఆర్ ఎస్ నేతలకు మతిభ్రమించి పనికిమాలిన వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు.

కాంగ్రెస్ ఎంఐఎం ల కే స్నేహపూర్వక బంధాలు ఉన్నాయని , అందుకే పనిగట్టుకొని బిజెపి పై, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ పై బురదజల్లే ప్రయత్నం చేస్తుందన్నారు. అన్ని వర్గాల ప్రజల ఆశీస్సులతోనే కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్ని వర్గాల అభివృద్ధి శ్రేయస్సు కోసం కృషి చేశారని, అందుకోసమే రెండవసారి కూడా భారీ మెజారిటీతో గెలుపొందారన్నారు. కాంగ్రెస్, టీఆర్ఎస్ నేతలు మత రాజకీయాలు చేయడం మానుకోవాలని, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ముస్లిం సమాజాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేయవద్దని ఆయన ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపిమైనారిటీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సమీ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాపరామకృష్ణ జన్మదిన వేడుకలు



రాజన్న సిరిసిల్ల, జులై 16 :(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల బిజెపి జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బిజెపి నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రతాప రామకృష్ణకు పలువురు నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సి మోర్చా అధ్యక్షులు సంటి మహేష్ ఆధ్వర్యంలో ప్రతాప రామకృష్ణ ని పలువురు బిజెపి నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం బుద్ధ విగ్రహాన్ని ఆయనకు బహుమతిగా అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రేగుల సంతోష్ బాబు, రేగుల మల్లికార్జున్, కుమ్మరి శంకర్, గోపు బాలరాజు, సగ్గు రాహుల్, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బంగారు బండగా మారిన బోరబండ : ఎమ్మెల్యే మాగంటి



హైదరాబాద్, జులై 16: :జూబ్లీహిల్స్ఎమ్మెల్యే మాగంటి గోపీనాథఆధ్వర్యంలో మంగళవారం బోరబండలో నిర్వహించిన 'సమస్యలపై శంఖారావం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సైట్-3 ప్రొఫెసర్ జయశంకర్ కమ్యూనిటీహాల్లో జరిగిన ఈ కార్యక్రమానికి డివిజన్ నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు మాగంటి సమక్షంలో వివిధ సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులను అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అందిన అన్ని ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరించటానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఎమ్మెల్యే మాగంటి సూచించారు.

పదేండ్ల క్రితం బోరబండ డివిజన్‌లోని చాలా బస్తీలు కనీస వసతులకు నోచుకోని పరిస్థితి ఉండేదని.. వీకర్‌సెక్షన్ పరిస్థితి మరీ దారుణంగా ఉండేదని గుర్తు చేశారు. గత పదేండ్లలో సకల సదుపాయలను కల్పించటమే కాకుండా దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించామని తెలిపారు. దీంతో కాలనీలకు ధీటుగా బోరబండ బస్తీల రూపురేఖలు మారిపోయాయని అన్నారు. బంగారు బండగా మారిన బోరబండకు చెందిన ప్రజలు ఈ మార్పును ఎన్నటికీ మరువలేరని అన్నారు. సమస్యల రహిత నియోజకవర్గంగా జూబ్లీహిల్స్‌ను తీర్చిదిద్దటానికి కట్టుబడి ఉంటానని పేర్కొన్నారు.

# చామ్‌రాజ్ నుంచి సరికొత్త టీ రుచులు - టీ ప్రియుల రుచిని తీర్చనున్న చామ్‌రాజ్




హైదరాబాద్, జులై 16: :నీలగిరి టీ బ్రాండ్ 'చామ్‌రాజ్' సరికొత్త రుచులను పరిచయం చేసింది. టీను ఇష్టపడే వారు ఈ రుచులను ఆస్వాదించవచ్చు. యునైటెడ్ నీలగిరి టీ ఎస్టేట్స్, కంపెనీ లిమిటెడ్ నుంచి 1922లో స్థాపించబడినదే ఈ ప్రీమియం నీలగిరి టీ బ్రాండ్ 'చామ్‌రాజ్'. దీని ప్రముఖ సీటీసీ బ్రాండ్ 'మాస్టర్ బ్లెండ్ సీటీసీ' కింద రెండు కొత్త వేరియంట్‌లను విడుదల చేసింది. చామ్‌రాజ్ కొత్త మాస్టర్ బ్లెండ్ సీటీసీ టీ దేశవ్యాప్తంగా ఉన్న టీ ప్రియుల రుచిని తీర్చడానికి రూపొందించబడింది. పాలు, చక్కెరతో సంపూర్ణంగా కలుస్తుంది. మాస్టర్ బ్లెండ్ సీటీసీ ప్యాకెట్ 500 గ్రాములు, 250 గ్రాములు వరసగా రూ.175, రూ.95 ఉన్నాయి. 'మాస్టర్ బ్లెండ్ జింజర్' వేరియంట్ బోల్డ్, స్పైసీ అల్లం రుచితో వస్తుంది. ఇది అనేక ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందిన టీ. మాస్టర్ బ్లెండ్ అల్లం 250 గ్రాముల ప్యాకెట్ రూ. 210కి లభిస్తుంది. 'మాస్టర్ బ్లెండ్ లెమన్' వేరియంట్ ప్రత్యేకమైన రుచిని అందిస్తుంది. తాజా నిమ్మకాయల ఫ్లేవర్ టీతో విలీనం చేస్తుంది. ప్రతి సివ్ సిట్రస్ రుచిని పునరుజ్జీవింపజేస్తుంది. మాస్టర్ బ్లెండ్ లెమన్ 250 గ్రాముల ప్యాకెట్ రూ. 210 కి లభిస్తుంది. చామ్‌రాజ్ టీ సింగిల్ ఎస్టేట్ ఆర్థోడాక్స్ టీ, బ్రోకెన్ ఆరెంజ్ పెకో దాని అత్యుత్తమ నాణ్యత, సుగంధ సంపదకు ప్రసిద్ధి చెందింది. ఈ టీ పూర్తి రుచిని అందిస్తుంది. ఇది పాలు, చక్కెరతో బాగా కలుస్తుంది. ప్రామాణికమైన రుచిని కాపాడుతుంది. సరికొత్త ప్యాకేజింగ్‌తో చామ్‌రాజ్ టీ ఎస్టేట్ భారతీయ టీ వినియోగదారులలో ఆర్థడాక్స్ టీ తాగే సంప్రదాయాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. చామ్‌రాజ్ ఆర్థోడాక్స్ టీ ఎస్టేట్‌లో అత్యధికంగా అమ్ముడైన ఉత్పత్తులలో ఒకటిగా ఉంది. టీ పరిశ్రమలో అనేక ప్రశంసలను పొందింది. చామ్‌రాజ్ టీ సింగిల్-ఎస్టేట్ ఆర్థోడాక్స్ టీ, బ్రోకెన్ ఆరెంజ్ పెకో ప్యాకెట్ 500 గ్రాములు, 250 గ్రాములు వరుసగా రూ. 190, రూ. 110 ఉన్నాయి. ఈ సందర్భంగా యునైటెడ్ నీలగిరి టీ ఎస్టేట్స్ కంపెనీ లిమిటెడ్ వైస్ ప్రెసిడెంట్ శిలాజిత్ రాయ్ చౌదరి మాట్లాడుతూ చామ్‌రాజ్ టీ ఎస్టేట్ ఎల్లప్పుడూ మా వినియోగదారులకు అత్యుత్తమ నీలగిరి టీలను అందించడానికి అంకితం చేయబడిందన్నారు. మా కొత్త మాస్టర్ బ్లెండ్ వేరియంట్‌లు అల్లం, నిమ్మకాయల నాణ్యత, ఆవిష్కరణల పట్ల మా నిబద్ధతకు నిదర్శనమన్నారు. చామ్‌రాజ్ భారతదేశంలో అత్యధికంగా టీ ఎస్టేట్‌లను కలిగి ఉందన్నారు. విభిన్నమైన నలుపు, ఆకుపచ్చ, ఊలాంగ్ ఆర్థోడాక్స్ టీలను అందిస్తుందన్నారు. టీ ఉత్పత్తిలో అగ్రగామిగా ఉన్న చామ్‌రాజ్ 1994లో ఫెయిం ట్రేడ్ సర్టిఫికేట్ పొందిందన్నారు. ఇది భారతదేశపు మొట్టమొదటి ఫెయిర్ ట్రేడ్ సంస్థలలో ఒకటన్నారు. చామ్‌రాజ్ టీ సులభమైన ఆన్‌లైన్ డెలివరీ ఎంపికలతో ప్రీమియం టీలను అందిస్తూ ఉందన్నారు. అల్లం, నిమ్మకాయ రుచులతో సహా కొత్త మాస్టర్ బ్లెండ్ టీలు ఇప్పుడు chamrajchai.com , ఒఎజీళీనీని వంటి ఈ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లలో అందుబాటులో ఉన్నాయన్నారు.

# హరితహారం చెట్టు నరికివేత.. రూ.4 వేల జరిమానా విధించిన అధికారులు

హైదరాబాద్, జులై 16: : నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిని అనుసరించి ఉన్న దుకాణాల వద్ద ఓ చెట్టును నరికివేశారు.

కసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారంలో ఈ మొక్కను నాటగా పెరిగి పెద్దయింది. అయితే సమీపంలోని దుకాణంలో పనిచేస్తున్న పర్వతాలు అనే వ్యక్తి మంగళవారం ఒక చెట్టును కొట్టేశాడు.

ఈ విషయం మున్సిపల్ కమిషనర్ శ్యాంసుందర్ దృష్టికి తీసుకెళ్లారు.

అతడి ఆదేశాల మేరకు పర్వతాలుకు రూ.4 వేల జరిమానా విధించినట్లు సిబ్బంది తెలిపారు. అలాగే కొట్టేసిన చెట్టు స్థానంలో మరో మొక్క నాటాలని సూచించారు. ఎవరైనా చెట్లను కొట్టేస్తే తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెట్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుడగ ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

**కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు-2024 ప్రదానోత్సవ సభ**

**21 జులై 2024 ఆదివారం, ఉ. 10.30 గం.**
సోమాజిగూడ ప్రెస్ క్లబ్, హైదరాబాద్

అధ్యక్షత
**డా. ఎస్. రఘు**
అసిస్టెంట్ ప్రొఫెసర్, ఉ.వి.వి.

ముఖ్య అతిథి
**శ్రీ కె. శ్రీనివాసరెడ్డి**
మీడియా అకాడమీ చైర్మన్, తెలంగాణ

శేఖర్ స్మారకోపన్యాసం
**శ్రీ ప్రసేన్**
కవి, జర్నలిస్ట్

విశిష్ట అతిథులు
**విమలక్క**
ప్రజాగాయని

**శ్రీ చలకాని వెంకట్ యాదవ్**
బార్ కౌన్సిల్ సభ్యులు, తెలంగాణ హైకోర్టు

ఆత్మీయ అతిథులు
**శ్రీ శంకర్ పామర్తి**
కార్టూనిస్ట్, సాక్షి

**శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్**
చిత్రకారులు

**శ్రీమతి చంద్రకళా శేఖర్**

అవార్డు గ్రహీత
**శ్రీ పి. నర్సిం**
ఎడిటోరియల్ కార్టూనిస్ట్
తెలంగాణ టుడే

నిర్వహణ
**శేఖర్ మిత్రులు**
**కుటుంబ సభ్యులు**

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.